# సంక్రాంతి వచ్చిందే తుమ్మెద..


భోగి మంటలు వేసి నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు


ముగ్గులు వేస్తున్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

- గిరి పల్లెల్లో మొదలైన సంక్రాంతి సంబరాలు
- ఉట్టిపడిన సంప్రదాయం.. ఆకట్టుకున్న రంగవల్లులు


సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయినులు

బుట్టాయగూడెం: భోగ భాగ్యాల భోగి.. సంప్రదాయాల సంక్రాంతి.. కష్టాలు తీర్చే కనుమ పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో మన్యం ప్రాంతంలో సంక్రాంతి శోభ ముందే వచ్చేసింది. గిరిజన గ్రామాల్లో అప్పుడే సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. సంక్రాంతి సంబరాలను నిర్వహించేందుకు ఒక పక్క గ్రామాల్లో ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటుంటే మరో పక్క గిరిజన సంక్షేమ పాఠశాలల్లో తెలుగుదనం పండుగ శోభ ఉట్టి పడేలా సంక్రాంతి వేడుకలను నిర్వహిస్తూ ఆకట్టుకుంటున్నారు. కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన పడమర పాలకుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి పండుగ వేడుకల్లో మండల ప్రత్యేక అధికారి లత భోగిమంటలు వేసి పండుగను ప్రారంభించారు. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాఠశాల ప్రాంగణంలో రకరకాల రంగవల్లులు వేసి అందంగా తీర్చిదిద్దారు. అదే విధంగా హరిదాసులు, గంగిరెద్దుల వేషధారణలతో విద్యార్థులు భోగిమంటల చుట్టూ సంక్రాంతి వచ్చిందే తుమ్మెద అంటూ పాటలు పాడుతూ నృత్యాలు చేసుకుంటూ తిరిగారు. అలాగే గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి పూజించారు. సంక్రాంతి పండుగ సాంప్రదాయాలను గుర్తు చేసేలా కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు వేసిన రంగవల్లులు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కుంజా పద్మ, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు కొమరం అర్జునుడు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


హరిదాసు వేషధారణలో గిరిజన విద్యార్థిని

### సంక్రాంతి అంటేనే మూడు రోజుల సందడి



సంక్రాంతి పండుగ వచ్చిందంటే మూడు రోజులూ గ్రామాల్లో సందడిగానే ఉంటుంది. అన్ని వర్గాల వారు ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఇటీవల కాలంలో సంక్రాంతి పండుగను సాంప్రదాయబద్ధంగా పాఠశాలల్లో కూడా నిర్వహించడం సంతోషంగా ఉంది. పిల్లలకు చదువులతోపాటు పండుగ సాంప్రదాయ విధానాలను నేర్పించడం ఎంతో ఆనందంగా ఉంది.

–కూరం పద్మ, పడమర పాలకుంట, బుట్టాయగూడెం మండలం

## క్లుప్తంగా

### నేత్రపర్వం శ్రీవారి గ్రామోత్సవం


క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు, గోదాదేవి

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. అందులో భాగంగా స్వామి, అమ్మవార్లు గోదాదేవికి బుధవారం ఉదయం నిర్వహించిన గ్రామోత్సవం కనువిందు చేసింది. ముందుగా ఆలయంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి అర్చకులు పూజాధికాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామి వారి వాహనం మేళతాళాలు, మంగళవాయిద్యాలు అర్చకుల, పండితుల మంత్రోచ్చరణలు, గజ, అశ్వ సేవల నడుమ క్షేత్ర పురవీధులకు పయనమైంది. అనంతరం ఆలయ కూడలిలోని విలాస మండపంలో స్వామి అమ్మవార్లను ఉంచి అర్చకులు పూజాధికాలను నిర్వహించారు.

### అయ్యప్పకు ప్రత్యేక పూజలు


అయ్యప్పస్వామి

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెంలో వేంచేసియున్న శ్రీహరిహర సుత అయ్యప్పస్వామి వారి దేవస్థానంలో బుధవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. నిత్య కైంకర్యాలతో పాటు, పంచామృతాభిషేకాలు నిర్వహించి, స్వామి వారిని అలంకరించి పూజలు నిర్వహించారు.

### సురక్షిత నీటిని అందించేందుకు కృషి


పాలకుంటలో మంచినీటి సరఫరా పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

బుట్టాయగూడెం: గిరిజన గ్రామాల్లో ప్రజలకు కుళాయిల ద్వారా సురక్షితమైన నీరు అందించేలా కృషి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని మారుమూల గ్రామమైన పడమర పాలకుంటలోని కుళాయిల ఏర్పాటుకు సంబంధించిన పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలంలో సుమారు రూ.12 కోట్లతో 40 వాటర్ ట్యాంక్‌లను నిర్మించినట్లు చెప్పారు. వీటి ద్వారా సుమారు 130 గ్రామాలకు కుళాయిల ద్వారా ఇంటింటికీ మంచినీటిని అందించేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఈరయ్య, తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ కలప పట్టివేత


అటవీ అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్

బుట్టాయగూడెం: అడవి నుంచి అక్రమంగా ట్రాక్టర్‌పై తరలిస్తున్న కలపను మంగళవారం రాత్రి అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం సమీపంలో తనిఖీలు నిర్వహించామని ఈ తనిఖీల్లో మారుజాతి కలప రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టుబడినట్లు రేంజ్ అధికారి శివరామకృష్ణ తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేశామని చెప్పారు. అక్రమంగా కలప రవాణా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కాగా ఈ తనిఖీల్లో డీఆర్‌ఓ జె.ప్రభాకర్, ఎఫ్ఎస్‌ఓ దినేష్, బీట్ ఆఫీసర్ రాంబాబు, నవతేజ, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

### రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

భీమడోలు: రైతులు పంటల బీమా పథకం ప్రీమియంను విధిగా చెల్లించాలని, తద్వారా రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ భీమడోలు ఏడీఏ డాక్టర్ పి.ఉషారాజకుమారి అన్నారు. భీమడోలు రైతు భరోసా కేంద్రం 3 వద్ద బుధవారం సాయంత్రం భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లోని వ్యవసాయ గ్రామ సహాయకులు, ఉద్యానవన గ్రామ సహాయకులకు కెపాసిటీ బిల్డింగ్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎరువులు, పురుగు మందుల వాడకం, పథకాల అమలు, ఈ పంట, పంటల బీమా తదితర అంశాలపై వివరించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పి.ఉషారాజకుమారి మాట్లాడుతూ పంటల బీమా పథకం ప్రీమియంను ఈనెల 15వ తేదీలోగా ప్రతి రైతు చెల్లించాలని, వరి ఎకరాకు రూ.500, మినుముకు రూ.60 చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. ఎరువులు, పురుగుల మందులను అధికంగా వాడి పెట్టుబడి పెంచుకోవద్దని సూచించారు.

### సంప్రదాయ పండుగ సంక్రాంతి


సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

చింతలపూడి: సంప్రదాయ పండుగ సంక్రాంతి అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ, ఉమెన్ ఎంపవర్‌మెంట్, కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, భోగి పళ్లు, పాలు, పొంగళ్లతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపాల్ ఎన్‌జేకే నరేంద్ర కుమార్, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

జంగారెడ్డిగూడెం: ఈ నెల పదో తేదీన ముక్కోటి సందర్భంగా శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి ఆలయంలో వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈవో తెలిపారు. పదో తేదీ శుక్రవారం ఉదయం ఐదు గంటలకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశామని, ఉదయం 11 గంటలకు స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. బుట్టాయగూడెం రోడ్‌లో ఉన్న శ్రీ సీతారామ స్వామి ఆలయంలో ముక్కోటి పర్వదినం సందర్భంగా స్వామి వారి సన్నిధిలో 24 గంటల పాటు ఏకాహం ఏర్పాటు చేసినట్లు ఈవో తెలియజేశారు.

### విర్డ్ ఆసుపత్రి సందర్శన


దివ్యాంగుడికి కృత్రిమ అవయవం అందజేస్తున్న డాక్టర్ కిషోర్

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆసుపత్రిని ప్రముఖ పిడియాట్రిక్ ఆర్థోపెడిక్స్ వైద్యులు డాక్టర్ కిషోర్ మూల్పూరి (హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్థోపెడిక్స్ యూనివర్సిటీ ఆఫ్ బ్రిటీష్ కొలంబియా, కెనడా) బుధవారం సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, పారిశుద్ధ్యం తదితర విషయాలు ఆయన పరిశీలించారు. ఆసుపత్రి నిర్వహణపై ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ప్రోస్తాసిస్ 3డీ ప్రింట్‌తో తయారైన కృత్రిమ అవయవాలను 24 మంది దివ్యాంగులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో విర్డ్ హాస్పిటల్ చైర్మన్ ఎస్‌వీ సుధాకర్, ఐవీఆర్ సుధాకర్, వి.నారాయణ మూర్తి, భవ్యచంద్, హమీద్, బాలాజీ, పాల్గొన్నారు.

### నల్లబ్యాడ్జీలతో నిరసన


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: రాష్ట్ర సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ పిలుపు మేరకు స్థానిక సహకార సంఘ ఉద్యోగులు బుధవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నిరసనను తెలిపినట్లు సంఘ కార్యదర్శి కిషోర్ తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే యూనియన్ పిలుపుకు అనుగుణంగా ఆందోళన చేపడుతామని ఆయన పేర్కొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా పిసా ఎన్నికలు

కుక్కునూరు: పిసా (పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్ యాక్ట్) కమిటీ ఎన్నికల్లో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం పట్ల బర్లమడుగు గ్రామానికి చెందిన గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బుధవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే బుధవారం ఇంజరం పంచాయతీకి సంబంధించి పీసా కమిటీ ఎన్నికల ప్రక్రియ బర్లమడుగు గ్రామంలో నిర్వహించారు. ఈ కమిటీ ఎన్నికలో వలస గిరిజనులైన గుత్తి కోయలను భాగస్వాములు చేయడం పట్ల విస్మయ వ్యక్తం చేస్తున్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి అనర్హులైన గుత్తి కోయలను కమిటీలో ఎంపికకు ఎలా పరిగణలోకి తీసుకున్నారని స్థానిక గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పక్క గ్రామ పంచాయతీ మారేడుబాకలో వలస గిరిజనులను పిసా ఎన్నికల పరిధి లోనికి కూడా తీసుకోలేదు. ఇదే పద్ధతి అన్ని పంచాయతీల్లో ఉండాలి గాని, పంచాయతీకి ఒక విధానం అమలు చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు.


కుక్కునూరు: ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

కావున ఎన్నికను రద్దుచేసి, మరలా నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలన్నారు.

**పిసా ఎన్నికల వాయిదా**

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం, కోటనాగవరం, కోయరాజమండ్రి, పాలకుంట గ్రామాల్లో బుధవారం ఏర్పాటు చేసిన పిసా (పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్ యాక్ట్) ఎన్నికలు వాయిదా పడ్డాయి. రెడ్డిగణపవరం పిసా ఎన్నికలకు సంబంధించి స్థానికులు, నిర్వాసిత గ్రామాల గిరిజనులు అభ్యంతరాలు తెలిపారు. ఆర్‌అండ్ఆర్ కాలనీకి రెడ్డిగణపవరం నుంచి వేరు వేరుగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలను బహిష్కరిస్తామంటూ చెప్పడంతో అక్కడ ఎన్నికలు నిలిచిపోయాయి. అలాగే కోటనాగవరం, కోయరాజమండ్రి, పాలకుంట గ్రామాల్లో కోరం పూర్తికాక ఎన్నికలు వాయిదా వేశారు. కాగా మిగిలిన గ్రామాల్లో ఎన్నికలు జరిగినట్లు ఎంపీడీఓ జ్యోతి తెలిపారు.


బుట్టాయగూడెం: ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతున్న గ్రామస్తులు

## మదన గోపాలునికి గరుడ వాహనం

కొయ్యలగూడెం: శ్రీరుక్మిణి సత్యభామ సమేత మతన గోపాలస్వామి వారికి గరుడ వాహనం సమకూరింది. గ్రామస్తులు, భక్తులు మద్దు వెంకట ప్రసాద్‌రావు, అన్నపూర్ణ దంపతులు స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి బహుకరించారు. సుమారు రూ.90 వేలతో గరుడ వాహనాన్ని తయారు చేయించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ముక్కోటి పురస్కరించుకొని పదో తేదీ దేవేరులతో స్వామి వారిని మొదటి సారిగా గరుడ వాహనంపై అధిష్టింప చేస్తామని అర్చకులు తెలిపారు. సుమారు 300 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయాన్ని ఇటీవల దాదాపు కోటి 30 లక్షల రూపాయల వ్యయంతో పునర్నిర్మించారు.


మదన గోపాలస్వామి వారికి బహూకరించిన గరుడ వాహనం

## ఎక్సైజ్ అధికారుల దాడులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని మైసన్నగూడెంలో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా జల్లేరు కాలువ ఒడ్డున సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. దాడుల్లో ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్, జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

**సారా స్వాధీనం**

పోలవరం రూరల్: పోలవరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో దాడులు నిర్వహించి సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. పోలవరం గ్రామ పరిధిలోని కమ్మరగూడెంలో సారా కలిగి ఉన్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై జి.సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

**మద్యం పట్టివేత**

టి.నరసాపురం: అక్రమంగా మద్యం కలిగి ఉన్న నేరంపై ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్సై వి.జయకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో తనిఖీలు నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన బండారు శ్రీను అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా మద్యం కలిగి ఉండటమే కాకుండా, వాటిని అమ్ముతున్నాడన్నారు. దీంతో శ్రీనును అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.6500 విలువైన పలు బ్రాండ్ల 42 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు.


బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

## తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న పోస్టల్ ఉద్యోగులు

జంగారెడ్డిగూడెం: తపాలా శాఖ పూర్తి స్థాయి ఆన్‌లైన్ సేవలు అందిస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు డివిజన్ ఎస్‌పీవో ఎస్.శ్రీకర్‌బాబు అన్నారు. గుర్వాయిగూడెం మానవత కల్యాణ మండపంలో పోస్టల్ ఉద్యోగుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 11, 12 తేదీల్లో తపాలా జీవిత బీమా నందు అత్యున్నత ప్రతిభ కనబరిచిన పోస్టల్ ఉద్యోగులను సన్మానించామన్నారు. జంగారెడ్డిగూడెం పోస్టల్ సబ్‌డివిజన్ పరిధిలో రూ.32 లక్షల ప్రీమియం సేకరించి ఆంధ్రప్రదేశ్ సర్కిల్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిందన్నారు. కార్యక్రమంలో డి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, డి.శ్రీకాంత్, డి.దుర్గారావు, కె.రాజేష్, జి.గంగాధరరావు, యూనియన్ నాయకులు, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన పల్లెలు గజగజ

- వారం రోజులుగా చలి విజృంభణ
- మంచుతో వాహనదారుల ఇక్కట్లు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలు గజగజలాడుతున్నాయి. గత వారం రోజులుగా సాయంత్రం ఐదు నుంచి ఉదయం 10 గంటల వరకూ చలిగాలులు తీవ్రంగా వీస్తున్నాయి. రాత్రి నుంచి మొదలైన పొగ మంచు ఉదయం 10 గంటల వరకూ తగ్గడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్ర సమయాల్లో ఇంటి నుంచి బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు. గిరిజన ప్రాంతంలో గత వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఈశాన్యం నుంచి వీస్తున్న చల్లని గాలుల కారణంగా ఉష్ణోగ్రతలు తగ్గుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. సాయత్రం ఐదు గంటలు దాటితే వాతావరణం చల్లబడిపోతుంది. ఉదయం, రాత్రి పూట గిరిజన గ్రామాల్లో చలిని తట్టుకోలేక ప్రజలు చలి మంటలు వేసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. కొండ ప్రాంతంలోని గ్రామాల్లో సాయంత్రం మూడు గంటలకు చలి గాలులు ప్రారంభమవున్నాయి. దీంతో ఇళ్లల్లో మంటలు వేసుకుని చలి నుంచి రక్షణ పొందుతున్నారు.



పొగమంచు కమ్మిన కొండలు (ఇన్‌సెట్‌లో) చలి మంట కాగుతున్న గిరిజనులు

## విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

చింతలపూడి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మోటివేషన్ క్లాస్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న చింతలపూడి మండల విద్యాశాఖాధికారి-2 ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఒక ప్రణాళిక తయారు చేసుకుని కష్టపడి చదవాలన్నారు. అనంతరం తొమ్మిదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మానవత జిల్లా కమిటీ జాయింట్ సెక్రటరీ పి.సోమ శేఖరాచార్యులు, చైర్మన్ ఎ.అప్పారావు, కన్వీనర్ కె.నాగ చిన్నారావు, ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పీఎస్ సుధాకర్, ఉపాధ్యాయులు కె.రమేష్ పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మానవతా సభ్యులు

### భూ సమస్యల పరిష్కారానికి కృషి

దెందులూరు: మండలం పరిధిలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల దృష్టికి వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. బుధవారం దెందులూరు తహసీల్దార్‌కార్యాలయంలో ఆమె మాట్లాడారు. భూ సంబంధిత సమస్యలపై గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో బాధితులు అర్జీలు అందజేశారన్నారు. ఉన్నతాధికారుల సూచనలు సలహాలు నిబంధనలకు అనుకూలంగా డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్, గ్రామాల సర్వే యర్లు, వీఆర్వోలు, వీఆర్‌ఏల సహాయ సహకారాలతో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

### 12న జిల్లా స్థాయి పాటల పోటీలు


కర పత్రాలను విడుదల చేస్తున్న నేతలు

చింతలపూడి: సంక్రాంతి పండుగ సందర్భంగా యువత పెడదోరణుల వైపు వెళ్లకుండా ఆనంద మనోహర ట్రస్ట్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన జిల్లా స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు మల్లగిరి ఇమ్మానుయేల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద పాటల పోటీల కరపత్రాలను విడుదల చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు రత్నా కాంప్లెక్స్ ఆవరణలో పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. దాసోహం వీరభద్రాచారి, ఎం.మోజేస్, పి.సత్యనారాయణ, ఎం.వరలక్ష్మి, ఎస్కే సుభాని, వసంతరావు, ఆర్‌వీఎస్ నారాయణ ప్రచార కరపత్రం ఆవిష్కరణలో పాల్గొన్నారు.

### కళాశాల విద్యార్థులకు కౌన్సెలింగ్

ఏలూరు టౌన్: కళాశాలకు వెళ్తున్నామంటూ ఇంట్లోంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఏలూరు నగరంలో ఆయా పార్కుల్లో దర్శనమిస్తున్నారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్సై క్రాంతిప్రియ, సిబ్బంది పార్కుల్లో తిరుగుతూ కళాశాలలకు డుమ్మా కొట్టి పార్కుల వెంబడి తిరుగుతున్న విద్యార్థినీ విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ ఏర్పాటు చేసిన అభయ పోలీస్ రక్షక దళం పార్కులను సందర్శిస్తూ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.